
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

ఆదివారం 14 జూలై 2024

న్యాయ విద్యలో సమూల మార్పులు

- న్యాయ నిపుణులకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మధరావు

- 5లో



జస్టిస్ మన్మధరావుకు సన్మానం

మన్యంలో భారీ వర్షం

జన జీవనానికి అంతరాయం

- చిత్తడిగా మారిన రోడ్లు
- పొలాల్లోకి చేరిన వర్షం నీరు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు



చింతపల్లిలో వర్షం

పాడేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల ప్రభావంతో పాడేరు ఏజెన్సీలో శనివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని జిల్లా కేంద్రం పాడేరులో జల్లులు కురవగా, సీలేరు, చింతపల్లి, జి.మాడుగుల, తదితర మండలాల్లో భారీ వర్షం పడింది. తాజా వర్షంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం ముంచంగిపుట్టు, హుకుంపేటలో జరిగిన వారపు సంతలకు వర్షం దెబ్బ తగిలింది. దీంతో వర్తకులు, రైతులు, ప్రజలు సైతం ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా పంట పొలాల్లో వర్షం నీరు భారీగా చేరింది. పలుచోట్ల వర్షం నీటితో నిండిన పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే హుకుంపేటలోని రాళ్లగెడ్డ, పాడేరు లోని బుంగాగెడ్డ, చిలకలమామిడిగెడ్డ, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మత్స్యగెడ్డ, డుంబ్రిగుడలో చాపరాయిగెడ్డ వర్షం నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

మెడికల్ కాలేజీ వద్ద హైవే రోడ్డు బురదమయం

పాడేరు-అరకులోయ జాతీయ రహదారిలో స్థానిక మెడికల్ కాలేజీ ఎదుట రోడ్డు భారీ వర్షానికి బురదమయమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చేపడుతుండడంతో వర్షానికి అక్కడ మట్టి మెయిన్ రోడ్డుపై వచ్చి బురదగా పేరుకుపోతున్నది. ఈక్రమంలో ఆ రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఇదే మార్గంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడింది, అయినప్పటికీ మెడికల్ కాలేజీ నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీ ఎదుట మెయిన్‌రోడ్డు బురదమయం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు, అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచన
- ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశం



పాడేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆయన శనివారం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి మండలంలో విధిగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వర్షాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల ప్రభావంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈక్రమంలో అనుకోని ఘటనలు చోటుచేసుకుంటే తక్షణమే కలెక్టరేట్‌కు సమాచారం అందించాలన్నారు. అలాగే ప్రజలు సైతం వర్షాల కురుస్తున్న సమయంలో గెడ్డలు, వాగులు దాటవద్దని ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ కోరారు.

రంపచోడవరంలో మీ కోసం కార్యక్రమం రేపు

జిల్లాలో రంపచోడవరం డివిజన్ కేంద్రంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల సమస్యలపై వినతులను స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి రంపచోడవరం, చింతూరు డివిజన్‌లకు చెందిన ప్రజలువచ్చి వినతులు సమర్పిస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఇబ్బంది లేకుండా చేయాలనే ఉద్దేశంతో సోమవారం రంపచోడవరంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని రంపచోడవరం, చింతూరు డివిజన్లకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగ్గురు ఐపీఎస్ అధికారుల బదిలీ

జిల్లా ఎస్పీగా అమిత్‌బర్ధార్

- విశాఖ సిటీ డిప్యూటీ కమిషనర్‌గా తుహిన్ సిన్హా
- ఏలూరు ఎస్పీగా చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్
- శ్రీకాకుళం ఎస్పీగా రంపచోడవరం ఏఎస్పీ కేవీ.మహేశ్వరరెడ్డి



అమిత్‌బర్ధార్



తుహిన్ సిన్హా



కె.ప్రతాప్ శివకిశోర్



కేవీ మహేశ్వరరెడ్డి

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

జిల్లాలోని ముగ్గురు ఐపీఎస్ అధికారులకు బదిలీలు అయ్యాయి. జిల్లా ఎస్పీగా అమిత్‌బర్ధార్‌ను నియమించగా, ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన తుహిన్‌సిన్హాను విశాఖ సిటీ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఏడాదిన్నరగా తుహిన్‌సిన్హా జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించారు. సౌమ్యుడుగా గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేయడం, ఇతర శాంతిభద్రతల విషయంలోనూ పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని కమ్యూనిటీ పోలీసింగ్‌ను విస్తరించారు. అలాగే పోలీసుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసిన మంచి అధికారిగా గుర్తింపు పొందారు.

జిల్లాకు కొత్తగా ఎస్పీగా వస్తున్న అమిత్‌బర్ధార్ వివాదాస్పదుడుగా గుర్తింపు పొందారనే విమర్శలున్నాయి. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం ఎస్పీగా పనిచేసిన అమిత్‌బర్ధార్‌పై ఎన్నికల కమిషన్ వేటు వేసింది. దీంతో అప్పటి నుంచి ఆయన పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. అలాగే గతంలో 2017, 2018 కాలంలో పాడేరు ఏఎస్పీగా ఆయన పనిచేశారు. ఆ సమయంలోనే అప్పటి అధికార పార్టీకు చెందిన అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు పట్టపగలు హతమార్చారు. అలాగే ఆయన పాడేరు ఏఎస్పీగా ఉన్న సమయంలోనే గంజాయి సాగు, అక్రమ రవాణా అధికంగా కాగా, గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను పోలీసు అధికారులు వినియోగించుకోవడం అప్పటి నుంచే మొదలు పెట్టారు. తాజాగా ఎన్నికల కమిషన్ వేటుకు గురై పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఆయన్ని జిల్లాకు ఎస్పీగా నియమించడం గమనార్హం.

ఇద్దరు ఏఎస్పీలకు ఎస్పీలుగా పోస్టింగ్‌లు

జిల్లాలో చింతపల్లి, రంపచోడవరం ఏఎస్పీలకు జిల్లా ఎస్పీలుగా పోస్టింగ్‌లు లభించాయి. చింతపల్లి ఏఎస్పీగా రెండేళ్లుగా పనిచేస్తున్న కె.ప్రతాప్ శివకిశోర్‌ను ఏలూరు ఎస్పీగా నియమించారు. అలాగే రంపచోడవరం ఏఎస్పీ (ఓఎస్‌డీ)గా పనిచేస్తున్న కేవీ.మహేశ్వరరెడ్డిని శ్రీకాకుళం ఎస్పీగా నియమించారు. అలాగే వీరిద్దరి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పెరిగిన అల్లం ధర

- అరకు సంతలో రూ.100 నుంచి రూ.120 కొనుగోలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరి రైతులు



విక్రయానికి తేచ్చిన అల్లం బస్తాలు

డుంబ్రిగుడ, జూలై 13: మన్యంలో గిరిజన రైతులు పండించిన అల్లానికి మంచి ధర పలుకుతున్నది. దీంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో రెండు రకాల అల్లంను పండిస్తుంటారు. ఒక్కో రకానికి ఒక్కో రేటు ఉంటుంది. ప్రధానంగా హైబ్రిడ్ అల్లం, దేశవాళీ అల్లం పండిస్తారు. ఈ పంటలను వారపు సంతలో విక్రయిస్తారు. అల్లం కొనుగోలుకు మైదానం ప్రాంతం నుంచి వ్యాపారులు ఏజెన్సీలోని వారపు సంతలకు వస్తుంటారు. మండంలో మంగళవారం గుంటసీమ, బుధవారం కించుమండ, శుక్రవారం అరకుల్లో వారపు సంతలు జరుగుతుంటాయి. వీటికి గిరిజనులు పండించిన పంటలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఈనెల 10వ తేదీన జరిగిన కించుమండ సంతలో అల్లం కేజీ రూ.80 నుంచి రూ.90లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అదే అల్లాన్ని ఈనెల 12వ తేదీ శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో ... మిగతా 6వ పేజీలో

పరాయి పంచన క్రీడా పాఠశాల

ఎనిమిదేళ్లుగా సొంత గూడు లేని గురుకులం

- యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోనే నిర్వహణ
- అరకొర సౌకర్యాల నడుమ శిక్షణ
- పెదలబుడును దత్తత తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2016లో క్రీడా గురుకుల పాఠశాల మంజూరు
- 2019లో స్థలం కేటాయించక వెనక్కిమళ్లిన నిధులు
- రాష్ట్రంలోనే ఏకైక క్రీడా గురుకుల పాఠశాల దుస్థితి



అరకులోయ వైటీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాల ఇదే

అరకులోయ, జూలై 13: రాష్ట్రంలోనే ఏకైక గురుకుల క్రీడా ఆశ్రమ పాఠశాల పరాయి పంచన కొట్టుమిట్టాడుతోంది. అరకులోయలో క్రీడా పాఠశాల ఏర్పాటై ఎనిమిదేళ్లు అయినా ఎదుగుబొదుగు లేకుండా పోయింది. కనీసం పాఠశాలకు సొంత గూడు లేదు. ఇక్కడ క్రీడాకారులు అరకొర సౌకర్యాల నడుమ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోనే శిక్షణ పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండలంలోని పెదలబుడు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2016వ సంవత్సరంలో గురుకుల క్రీడా పాఠశాలను అరకులోయకు మంజూరు చేశారు. నాటి నుంచి ఐటీడీఏకు చెందిన యూత్ ట్రైనింగ్‌సెంటర్‌లోనే ఈ క్రీడా పాఠశాలను నిర్వహిస్తున్నారు. చాలీచాలని వసతిగృహంలో, అరకొర సౌకర్యాలతో క్రీడాకారులు ప్రాక్టీసు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 2019లో క్రీడా పాఠశాలకు ప్రత్యేకంగా క్రీడామైదానంతో పాటు పాఠశాల, వసతి గృహం నిర్మాణాలకు గిరిజన సంక్షేమ శాఖ రూ.25 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరు చేసినప్పటికీ అవసరమైన స్థలం కేటాయింపు జరగకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. అయితే స్థానిక క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి స్థలం కోసం చేసిన కృషి ఫలితంగా 2022 జూలైలో అంజోడ ఫాంకు ఎదురుగా సెరికల్చర్ డిపార్టుమెంట్‌కు చెందిన 26.34 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం క్రీడా పాఠశాలకు కేటాయించింది. ప్రస్తుతం స్థలం సిద్ధంగా ఉన్నప్పటికీ క్రీడా పాఠశాల భవనాలు, వసతిగృహం, క్రీడా మైదానం కోసం నిధులు లేవు. క్రీడా పాఠశాలను గత ఎనిమిదేళ్లుగా ఐటీడీఏకు చెందిన వైటీసీ కేంద్రంలో ఒక బ్లాక్‌లో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల ఏర్పడిన నాటి నుంచి ఆరు బ్యాచ్‌లు పదో తరగతి ... మిగతా 6వ పేజీలో



ఎడ్యుకేషన్ హబ్ మైదానంలో ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

ఏయూలో అక్రమాలపై విచారణకు మీనమేషాలు

రెండు వారాల క్రితం వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా



- ఆయన హయాంలో అనేక అవకతవకలు, అడ్డగోలు నియామకాలు జరిగాయని ఆరోపణలు
- ఇప్పటివరకూ ఆ దిశగా దృష్టిపెట్టని పాలకులు
- ఇన్‌చార్జి వీసీ నియామకంలోనూ జాప్యం
- లక్ష్మీపార్వతికి ప్రొఫెసర్‌షిప్‌పై స్పందించని ఇన్‌చార్జి రిజిస్ట్రార్
- మరోవైపు ప్రొఫెసర్ బాధ్యతలకు దూరంగా ప్రసాదరెడ్డి
- వర్సిటీకి హాజరుకాని వైనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కొత్త ప్రభుత్వం ప్రక్షాళన చేస్తుందని భావిస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. వైస్ ఛాన్సలర్‌గా ప్రసాదరెడ్డి చేసిన అరాచకాలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారని అంతా అనుకున్నారు. కానీ, ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. పైగా ప్రసాదరెడ్డి వెళ్లేముందు తనకు అనుకూలంగా ఉండే వ్యక్తికే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పదవి కట్టబెట్టారు. ఆయన ఏ విషయంపైనా నోరుమెదపడం లేదు.

ప్రసాదరెడ్డి రాజీనామా చేసి రెండు వారాలు అవుతున్నా ఇప్పటివరకూ ఇన్‌చార్జి వీసీని నియమించలేదు. మరోవైపు ప్రసాదరెడ్డి రాజీనామా ఇంకా ఆమోదం పొందలేదని ప్రచారం జరుగుతోంది. అందుకే ఆయన యూనివర్సిటీకి రావడం లేదని అంటున్నారు. వాస్తవానికి వీసీ పదవికి రాజీనామా చేసిన తరువాత ఆయన కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా విధులకు హాజరుకావాలి. కానీ జూలై నెలలో ఆయన ఇప్పటివరకూ ... మిగతా 6వ పేజీలో

పాలిథిన్, ప్లాస్టిక్ రహితంగా అరకులోయ

- ప్లాస్టిక్, పాలిథిన్, వాటర్ బాటిళ్లు నిషేధం
- పెదలబుడు సర్పంచ్ దాసుబాబు



మాట్లాడుతున్న పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబు

అరకులోయ, జూలై 13: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో పాలిథిన్, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదాద్దుదామని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ప్రకటించారు. శనివారం మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రోజురోజుకు పర్యాటక కేంద్రంలో ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగం అధికమైందని, దీనివల్ల పర్యావరణం కలుషితం అవుతున్నదన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు చర్చించి, నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ విధంగా తీర్మానించిందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ సంచులు, వాటర్‌బాటిళ్లను నిషేధించినట్టు చెప్పారు. పది లీటర్లు, ఆపై ఉన్న వాటర్ బాటిళ్లను అనుమతిస్తున్నట్టు సర్పంచ్ దాసుబాబు తెలిపారు. గాజు బాటిళ్లను వినియోగించుకోవచ్చునన్నారు. పాలిథిన్ కవర్లపై ఇప్పటికే నిషేధం అమలులో ఉన్నప్పటికీ పలు దుకాణాలు, హోటళ్లలో వినియోగిస్తున్నారని, ఇకపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

పంచాయతీలకు నిధులు కేటాయించడం హర్షణీయం

పంచాయతీలకు నిధులు కేటాయిస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించడం హర్షణీయమని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు మంజూరైన నిధులు పక్కదారి పట్టించిందని ఆయన ఆరోపించారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ప్రకటించినట్టే ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంపై పెదలబుడు, మాదల సర్పంచులు పెట్టెలి దాసుబాబు, శ్రీనివాసరావు, పద్మాపురం మాజీ సర్పంచ్ లకోయ్ మహదేవ్, టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, టీడీపీ నాయకుడు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

కొయ్యూరు, జూలై 13: గ్రామదర్శినికి వెళ్లే పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ శివారు కన్నవరం గ్రామ సమీపంలో ఈ డంప్ లభ్యమైందని చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఈ డంప్‌ను కూంబింగ్ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. డంప్‌లో రెండు కిలోల బరువు గల కొడెక్స్ వైర్‌తో పాటు పేలుడు పదార్థాలు, బ్లాస్టింగ్‌కు వినియోగించే ఎలక్ట్రికల్ వస్తువులు, మావోయిస్టు పార్టీకి చెందిన విప్లవ సాహిత్యం ఉన్నాయని అదనపు ఎస్పీ వివరించారు.

మావోయిస్టుల డంప్‌లు లేకుండా చేస్తాం: ఏఎస్పీ

మన్యం ప్రాంత అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులను సమూలంగా నిర్మూలించడమే తమ ధ్యేయమని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నవరం అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్ స్వాధీనం చేసుకున్న సందర్భంగా శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మావోయిస్టుల డంప్ స్వాధీనం చేసుకోవడంలో ఇది రెండోదన్నారు. మే 25న సీలేరు పోలీస్ స్టేషన్ ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

విద్యుదాఘాతంతో గిరిజనుడి మృతి



రాజుబాబు (ఫైల్)

చింతపల్లి, జూలై 13: మండలంలోని చిన్నరాజుపాకలు గ్రామంలో ఓ గిరిజనుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మూడు రోజులుగా చిన్నరాజుపాకలు గ్రామానికి విద్యుత్ సరఫరా లేదు. దీంతో గ్రామస్థులు లంబసింగి ఈపీడీసీఎల్ లైన్‌మన్‌కి ఫోన్ చేశారు. వర్షాలు కురుస్తుండడం, విద్యుత్ తీగలకు సమీపంగా తుప్పలు అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని విద్యుత్ సరఫరా నిలిపివేశామని లైన్‌మన్ సమాధానం ఇచ్చాడు. శనివారం 33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రకటించారు. దీంతో చిన్నరాజుపాకలు గ్రామానికి చెందిన గిరిజనులు విద్యుత్ తీగలపై ఉన్న మొక్కల పాదులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నిర్ణయించుకుని పనులు ప్రారంభించారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ముందుగా ప్రకటించిన ఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు వర్షం కారణంగా పనులు చేపట్టలేమని సుమారు 10 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో పాదులు తొలగిస్తున్న చిన్నరాజుపాకలు గ్రామానికి చెందిన రుత్తల రాజుబాబు(52) విద్యుదాఘాతానికి గురై కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తరలించారు. అయితే అప్పటికే రాజుబాబు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటనపై చింతపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

కణుజు మాంసంతో ముగ్గురి అరెస్టు

» మరో ముగ్గురు పరారీ

మాకవరపాలెం, జూలై 13: మండలంలో ఎరకన్నపాలెంలో కణుజు మాంసంతో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని అరెస్టు చేశామని నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనర్సు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. మండలంలో రాచపల్లి శివారు ఎరకన్నపాలెంలో వన్యప్రాణి కనుజును కొందరు వేటాడారు. శనివారం ఉదయం కణుజు మాంసం విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న నర్సీపట్నం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనర్సు తన సిబ్బందితో దాడి చేశారు. 30 కిలోల కణుజు మాంసంతో పాటు అడిగర్ల రాజు, కొల్లునూకరాజు, కొల్లు రామారావు అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎ.రాజు, రావాడ సాయితో పాటు మరో వ్యక్తి పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నామని రేంజర్ తెలిపారు.

350 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

పెదబయలు, జూలై 13: అడుగులపుట్టు కూడలిలో 350 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముందస్తు సమాచారంతో శనివారం సిబ్బందితో ఎస్ఐ అడుగులపుట్టు కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితులు జి.మాడుగుల మండలం కుంబిడిసింగి పంచాయతీ గద్దేరాయి గ్రామానికి చెందిన జగ్గందొర గోపాలస్వామి, జగ్గందొర వెంకటరమణ, గొల్లోరి హరిప్రసాద్‌గా గర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



భారపు సాయికృష్ణ (ఫైల్)

కొత్తూరు, జూలై 13: మునగపాక మండలం ఉమ్మలాడ పంచాయతీలో మతిస్థిమితం లేని యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్టు మునగపాక ఇన్‌చార్జి ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. ఉమ్మలాడ పంచాయతీ ముత్రాసుకాలనీకి చెందిన భారపు సాయికృష్ణ (26)కు కొద్దికాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండేది కాదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సాయికృష్ణ అక్క అనపర్తి జయ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



దుర్గా ప్రసాద్(ఫైల్)

ఎలమంచిలి, జూలై 13: మునిసిపాలిటీలోని శేషుకొండ కాలనీలో ఒక యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. శేషుకొండ ప్రాంతానికి చెందిన దమ్ము దుర్గాప్రసాద్(27) భార్యతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడన్నారు. తన భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

న్యాయ విద్యలో సమూల మార్పులు

» న్యాయ నిపుణులకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

» ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మథరావు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 13: జాతీయ స్థాయిలో న్యాయ విశ్వవిద్యాలయాల స్థాపనతో న్యాయవిద్యలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని, న్యాయాన్ని అధ్యయనం చేసే విధానం మారిందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జస్టిస్ మన్మథరావు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. న్యాయ విద్యను పూర్తి చేసినవారికి అనేక ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు లభిస్తున్నాయన్నారు. మీడియేషన్, ఆర్బిట్రేషన్, మారిటైం, ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌లో వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా అనేక అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అనేకమంది న్యాయ విద్య పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. వర్సిటీలు కూడా అంతే ప్రాధాన్యతతో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తున్నాయని చెప్పారు. దేశంలో న్యాయ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. గ్రాడ్యుయేషన్ తరువాత ఎక్కువ మంది లైటిగేషన్ వైపు కాకుండా కార్పొరేట్ రంగాల వైపు వెళుతున్నారని, అందువల్ల క్షేత్ర స్థాయిలో న్యాయ నిపుణుల కొరత వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎక్కువ మంది సామాజిక బాధ్యతను నిర్వర్తించేందుకు లోకల్ కోర్టులలో కొంతకాలం ప్రాక్టీసు చేసినట్టయితే ట్రయిల్ కోర్టు అనుభవం రావడంతో పాటు ఎక్కువ మంది లాయర్లు అందుబాటులోకి వస్తారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. న్యాయ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జస్టిస్ మన్మథరావు న్యాయ శాస్త్రంలో పరిశోధన చేశారని, ఇంకా కొనసాగిస్తున్నారని, ఆయన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సీపీ, అకాడమిక్ డీన్ సోమా భట్టాచార్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

నర్సీపట్నంలో చెత్త నిర్వహణ అధ్వానం

» మరమ్మతులకు గురైన కంపాక్టర్, ఎక్స్‌కవేటర్

» వినియోగంలోకి రాని కంపోస్ట్ యార్డు

» డింపింగ్ యార్డుకు రోడ్డు సౌకర్యం లేక అవస్థలు

» పట్టించుకోని పాలకవర్గం, ఉన్నతాధికారులు

తడి, పొడి చెత్త నిర్వహణ అస్తవ్యస్తం



డంపింగ్ యార్డులో కూరుకు పోయిన చెత్త ట్రాక్టర్

నర్సీపట్నం, జూలై 13: మునిసిపాలిటీలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వార్డులు, ప్రధాన రహదారులు చెత్తకుప్పలతో నిండిపోయాయి. దుర్గంధం, దోమల బెడదతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఊరంతా కంపు కొడుతున్నా గత పాలకవర్గం పట్టించులేదన్న విమర్శలు వస్తున్నాయి. డింపింగ్‌కు రోడ్డు లేక ట్రాక్టర్లతో చెత్తను తరలించడం లేదు. చెత్త సమస్యపై కౌన్సిల్ సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిలర్లు ప్రతీ నెలా అధికారులను నిలదీస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. నర్సీపట్నంలోని ప్రధాన కూడళ్లలో డంపర్ బిన్లు చెత్తతో నిండిపోయినా తొలగించడం లేదు. కాంపాక్టర్, ఎక్స్‌కవేటర్ మరమ్మతులకు గురైనా వాటికి మరమ్మతులు చేయించడం లేదు.

నిరుపయోగంగా కంపోస్ట్ యార్డు

2016 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయ్యన్నపాత్రుడు చొరవతో బలిఘట్టంలోని వరహానదిని ఆనుకొని సాలిడ్ వేస్ట్ మేనేజ్ పార్కు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దీనికి రూ.1.5 కోట్లు 13వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలి. ఈ కంపోస్టు యార్డు నిర్వహణ బాధ్యతలను 2017 ఆగస్టులో క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రతీ రోజు 14 నుంచి 16 టన్నుల తడి చెత్తను క్యూబ్ బయో ఎనర్జీ సంస్థకు అప్పగించాలి. అయితే వార్డులలో డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ జరగకపోవడంతో క్యూబ్ బయో ఎనర్జీ సంస్థకు పూర్తిస్థాయిలో చెత్తను సరఫరా చేయలేకపోతున్నారు. అదే విధంగా పొడి చెత్త నుంచి పేపర్లు, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్, గాజు పెంకులు వేరు చేసి మిగిలిన వ్యర్థాలను కాపులుప్పాడలో ఉన్న విద్యుత్ తయారీ కేంద్రానికి తరలించాలి. వారానికి 30 టన్నులు పొడి చెత్త తరలించడానికి విజయవాడకు చెందిన తరుణి అసోసియేట్స్ సంస్థకు రెండేళ్ల క్రితం కాంట్రాక్ట్ ఇచ్చింది. అయితే డంపింగ్ యార్డులో రోడ్డు సౌకర్యం లేక సదరు సంస్థ చేతులెత్తేసింది. దీంతో రోజు రోజుకి డంపింగ్ యార్డులో చెత్త కొండలా పేరుకు పోయింది. వర్షం పడితే బురదలో చెత్త ట్రాక్టర్లు కూరుకు పోతున్నాయి. ట్రాక్టర్ దిగిబడిన చోటే చెత్తను వేసేస్తున్నారు. డంపింగ్ యార్డులోకి ఎక్స్‌కవేటర్ టైర్లు బురదలో కూరుకుపోతున్నాయి. చైన్ ఎక్స్‌కవేటర్ అద్దెకు తీసుకొని డంపింగ్ యార్డులో రోడ్డు మార్గం శుభ్రం చేయడానికి రూ.2 లక్షలతో చేసిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డంపింగ్ యార్డులోకి చెత్త తరలించడానికి వీలు లేక, మరోచోట డంపింగ్ చేసే అవకాశం లేక మెయిన్ రోడ్డులో ఎక్కడ చెత్తను అక్కడే వదిలేస్తున్నారు.

తడి, పొడి చెత్త సేకరణ శూన్యం

నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28 వార్డుల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా అందించడానికి ప్రతీ ఇంటికి మూడు డస్ట్‌బిన్‌లు చొప్పున 60 వేలు ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. దీనికి రూ.31.58 లక్షలు ఖర్చు చేశారు. కంపోస్ట్ యార్డు వినియోగంలో లేక నిధులు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. డోర్ టు డోర్ తడి,పొడి చెత్త సేకరణ జరగడం లేదు. టీడీపీ హయాంలో మంజూరు చేసి ట్రాక్టర్లు, వ్యాన్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో రెండు ట్రాక్టర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తర్వాత ట్రాక్టర్లు కొనుగోలు చేయలేదు. ప్రస్తుతం మూడు అద్దె ట్రాక్టర్లుతో చెత్త తోలుతున్నారు. ప్రస్తుతం ఉన్న జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేక చెత్త సేకరణ పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు అంటున్నారు.



డంపింగ్ యార్డులో అధ్వానంగా ఉన్న రహదారి

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

పదేళ్లుగా పెంచిన చెట్లను విద్యుత్ సిబ్బంది నరికివేయడంపై విమర్శలు



మంచాల ఊరచెరువు గట్టుపై ఉన్న చెట్లను నరికి వేసిన విద్యుత్ సిబ్బంది

చీడికాడ, జూలై 13: పదేళ్లుగా పెంచుతున్న చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది అర్థాంతరంగా నరికివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచాల ఊరచెరువు గట్టు నుంచి ఎం.గదబూరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పథకం ద్వారా పది సంవత్సరాల క్రితం మొక్కలు వేశారు. వాటి సంరక్షణకు నీటి తడుపులు, కంచె పెట్టడానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు. ఊరచెరువు గట్టుపై ఉన్న తారురోడ్డుకి ఇరువైపులా సుమారు 50 చెట్లు ఉన్నాయి. అయితే చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి తరచూ మంచాల గ్రామానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని విద్యుత్‌శాఖ అధికారులు చెరువువైపు ఉన్న చెట్లను మొదళ్లకే నరికివేశారు. ప్రభుత్వ నిధులతో విద్యుత్ స్తంభాల కింద మొక్కలు వేయడం ఎందుకు, వాటిని నరికివేయడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ నమ్మి వెంకటరావును వివరణ కోరగా, చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో తరచూ విద్యుత్‌కి అంతరాయం ఏర్పడుతోందని, దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చెట్లను మధ్యలో నరికివేశామని, మళ్లీ అవి చిగురిస్తాయని చెప్పారు. ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపీవో సియ్యాద్రి నాగరాజును వివరణ కోరగా ఉపాధి పథకం వీఆర్పీలు కష్టపడి లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులతో చెట్లను పెంచితే కనీసం విద్యుత్‌శాఖ అధికారులు ఎంపీడీవో అనుమతి కూడా తీసుకోకుండా నరికి వేయడం ఏమిటని, దీనిపై ఎంపీడీవోకి ఏఈపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

కోడి మెడ కొరికేసిన డ్యాన్సర్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 13: వేదికపై డ్యాన్స్ చేస్తూ అతి దారుణంగా కోడి మెడ కొరికిన వ్యక్తిపై అనకాపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదుచేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ సంఘటనపై క్రూయల్టీ రెస్పాన్స్ కో-ఆర్డినేటర్ సించాన సుబ్రహ్మణ్యన్ మెయిల్ ద్వారా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన ఆ వీడియోను మెయిల్ ద్వారా ఎస్పీకి పంపించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ ఆఫ్ యానిమల్స్ యాక్టు కింద ఈ నెల ఆరో తేదీన పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ సంఘటన అనకాపల్లిలో జరిగినట్టు ఫిర్యాదు దారుడు పేర్కొన్నారు.

అది విష్ణు ఈవెంట్స్ కళాకారుల ప్రదర్శనగా వీడియో ఆధారంగా గుర్తించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. అయితే ఆ సంస్థ ఏ ప్రాంతానికి చెందినది, సంఘటన ఎక్కడ జరిగిందీ విచారణ జరుపుతున్నారు. కేసును ఎస్ఐ వీవీ రమణ దర్యాప్తు చేస్తున్నారు.

'విరాళం డబ్బులు గుడి నిర్మాణానికే ఖర్చు చేశాం'

నర్సీపట్నం, జూలై 13: నూకాంబికా అమ్మవారి ఆలయం నిర్మాణానికి సీఎంఆర్ అధినేత ఇచ్చిన రూ.10 లక్షలు గుడి నిర్మాణానికి ఖర్చు చేశామని ఆలయ చైర్మన్ దనిమిరెడ్డి నాగు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు దేవదాయ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విరాళంగా ఇచ్చిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆలయ గోపురం, విగ్రహాలు, శాలాహారం తయారు చేయించడానికి రూ.9 లక్షలు దఫదఫాలుగా ఖర్చు చేశామని చైర్మన్ దనిమిరెడ్డి నాగు తెలిపారు. శిల్పికి రూ.7.4 లక్షలు, ఇసుక, ఇటుకలు, సిమెంటుకు రూ.1.6 లక్షలు స్వయంగా తాను ఖర్చు చేశానని ఆ ప్రకటనలో తెలిపారు.

30 రోజుల్లో అద్భుతమైన పాలన

» మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూలై 13 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 30 రోజుల్లోనే అద్భుతమైన పాలన అందించిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ప్రధానంగా మెగా డీఎస్సీ, వృద్ధాప్య పింఛన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం, ఉచిత ఇసుక తదితర హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, ఎర్ర చందనం లాంటి స్మగ్లింగ్ కార్యక్రమాలకు కట్టడి చేస్తూ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో పరుగులు తీయించేందుకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయన్నారు.

రక్తమోడిన రహదారి

» పారిశ్రామిక ప్రాంతంలో రెండుచోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురి మృతి

» పాత గాజువాకలో తల్లీకూతుళ్లు మృత్యువాత

» అగనంపూడిలో వివాహిత..

గాజువాక, జూలై 13: పారిశ్రామిక ప్రాంతంలో వేర్వేరుగా రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పాత గాజువాకలో తల్లీకూతుళ్లు, అగనంపూడి కూడలిలో ఓ వివాహిత మృతి చెందారు. ఆయా సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అగనంపూడి సమీపంలోని దానబోయినపాలేనికి చెందిన జాజుల సూరిబాబు అనే వ్యక్తి భార్య జాజుల పార్వతి (55), కుమార్తె పి.సత్యవతి (26), మనవడు పార్థులతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం ఉదయం వేపగుంట వద్దనున్న ఓ ఆస్పత్రికి వచ్చి సాయంత్రం ఇంటికి తిరిగి బయలు దేరారు. ఈ క్రమంలో పాత గాజువాక కూడలి సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ఓ లారీ బలంగా వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పార్వతి, సత్యవతి లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సూరిబాబు, పార్థులు మరోవైపు పడిపోవడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. తన కళ్లెదుటే భార్య, కుమార్తె కానరాని లోకాలకు తరలిపోవడంతో సూరిబాబు బోరున విలపిస్తూ రోడ్డుపైనే సొమ్మసిల్లి పడిపోయారు. ప్రమాద సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లీకూతుళ్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగనంపూడిలో వివాహిత..

కూర్మన్నపాలెం: అగనంపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం గోవాడకు చెందిన సరకాన రేవతి తన భర్త సతీశ్‌తో కలిసి బైకుపై తమ అమ్మ వాళ్లింటికి గాజువాక సమీపంలోని మింది గ్రామానికి బయలుదేరింది. ఈ క్రమంలో అగనంపూడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ అతి వేగంతో వచ్చి వెనుక నుంచి వీరి బైకును ఢీకొంది. దీంతో బైకు వెనుక కూర్చున్న రేవతి కింద పడడంతో ఆమె చేతి మీదుగా లారీ ముందుకు పోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తన కళ్లెదుటే భార్య మృత్యువాత పడడంతో సతీశ్ బోరుమని విలపించారు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రేవతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవరును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రేవతి, సతీశ్‌లకు నాలుగేళ్ల క్రితం వివాహమవ్వగా, వీరికి భవ్యేశ్, నేహల్‌కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సతీశ్ ఫార్మాసిటీలో లారస్ ల్యాబ్‌లో కెమిస్టుగా పని చేస్తున్నారు.

'అటల్ టింకరింగ్'పై డీఈవో సమీక్ష

కొత్తూరు, జూలై 13: అనకాపల్లి జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్ పనితీరు, మార్గదర్శకాలపై జిల్లా జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం సమీక్షించారు. పట్టణంలోని జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో 13 సూచికలు, పనితీరు, వాటిని ఆశించిన రీతిలో ఎలా సాధించాలో వివరించారు. అంతేగాకుండా విద్యార్థులు ప్రాజెక్టులు ఏ విధంగా రూపొందించాలనే అంశాలపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్, జిల్లా సైన్స్ అధికారి డి. కాళిదాసు పర్యవేక్షించి పాఠశాలల పనితీరు జాబితాను అందించారు. ఈ సమావేశంలో జిల్లాలోని 30 అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



రామావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 13: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్నా హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి శనివారం భక్తులకు రామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఇంకెన్నాళ్లు.. పాకల్లో చదువులు!

శిథిలం.. అసంపూర్ణం.. కనీస రక్షణ చర్యలు శూన్యం.. ఇదీ మన్యంలోని చాలా గ్రామాల్లో పాఠశాలల భవనాలు దుస్థితి. ఎటువంటి గత్యంతరం లేక పూరి పాకలు, కర్రల దన్నుతో ఉన్న షెడ్లలోనే తరగతుల నిర్వహణ. ఫలితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సి వస్తోంది. అయినప్పటికీ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడం ఆదివాసీలకు రుచించడం లేదు.

- కొన్ని పాఠశాలల భవనాలు శిథిలం
- మరికొన్ని చోట్ల నూతన భవనాలు అసంపూర్ణం
- పూరి పాకలు.. షెడ్లలో తరగతుల నిర్వహణ
- బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



జిమాడుగుల మండలం మారుమూల రాసపనుకు గ్రామంలో పూరి గుడిసెలో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల

నాలుగేళ్లుగా పూరి పాకలోనే నిమ్మచెట్టు పాఠశాల

సీలేరు, జూలై 13: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామంలో ప్రాథమిక పాఠశాల నాలుగేళ్లుగా పూరి పాకలోనే కొనసాగుతోంది. ఈ భవనం నాలుగేళ్ల క్రితం శిథిలమైంది. అప్పటి నుంచీ పాఠశాల బాగోగులను పట్టించుకునే నాథులే కరువయ్యారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో స్థానికంగా ఓ పూరి పాకలో తరగతులను నిర్వహించాల్సి వస్తోంది.

నిమ్మచెట్టు గ్రామంలోని పాఠశాలలో ప్రస్తుతం 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి విద్యాభ్యాసానికి తగిన వసతులు లేవు. పాఠశాల కోసం నిర్మించిన భవనం నాలుగు సంవత్సరాల క్రితం కూలిపోయింది. దీంతో గ్రామస్థుల సహకారంతో నిర్మించిన పూరిపాకలోనే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని పలుమార్లు పాలకులు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని వార్డు సభ్యురాలు



నిమ్మచెట్టు గ్రామంలో నాలుగేళ్ల క్రితం శిథిలమైన పాఠశాల భవనం



నిమ్మచెట్టు గ్రామంలో కనీస రక్షణ లేని షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

బాకూరి రాజేశ్వరి, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు కార్యక్రమంలో కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దామని గొప్పలు చెప్పడమే తప్పితే మారుమూల గ్రామాల్లో కనీసం భవనం కూడా మంజూరు చేయలేదడానికి నిమ్మచెట్టు గ్రామంలోని పాఠశాలను చక్కని ఉదాహరణగా చెప్పవచ్చని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిమ్మచెట్టు వంటి మారుమూల గ్రామాల్లో గిరిజన విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పాఠశాల భవనం, మరుగుదొడ్లు, వంటషెడ్డును నిర్మించాలని,చి గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

అసంపూర్తిగా రాసపనుకు పాఠశాల భవనం

జి.మాడుగుల: మండలంలోని వంతాల పంచాయతీ పరిధిలో రాసపనుకు పాఠశాల భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ భవనం పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. నాడు-నేడు రెండో విడతలో మంజూరైన పాఠశాల భవనం పనులు పూర్తి చేయకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. గత్యంతరం లేక కర్రల దన్నుతో ఏర్పాటు చేసిన షెడ్డులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాత్కాలిక షెడ్డలో వర్షం నీరు చేరుతున్నదని, ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో చలి గాలులు వీస్తున్నాయని, దీంతో చిన్నారులు పడరాని పాట్లు పడుతున్నారని వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతున్నదని వారు వాపోయారు. ఈ విషయంపై ఎంఈవో బాబూరావుపడాల్‌ను ఫోన్‌లో వివరణ కోరగా బిల్లులు చెల్లించకపోవడంతో రాసపనుకు పాఠశాల భవనం మధ్యలోనే నిలిచిపోయిందని చెప్పారు. అంతేకాకుండా రెండో విడతలో మంజూరైన పాఠశాల భవనాలు సైతం నిధుల కొరతతో నిర్మాణ పనులు అసంపూర్ణగా ఉన్నాయన్నారు. ఇటువంటి భవనాల జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపామని ఆయన వివరణ ఇచ్చారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన రాసపనుకు నూతన పాఠశాల భవనం

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

- మన్యంలో ఏకధాటిగా కురిసిన వాన
- వారపు సంతల నిర్వహణకు అంతరాయం

చింతపల్లి, జూలై 13: మన్యంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా కుండపోత వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. పంట పొలాలు, చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి. అధిక వర్షంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నారుమడులు కుళ్లిపోకుండా మురుగు నీరు పోయే బోదెలను ఏర్పాటు చేసుకోవాలని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే చింతపల్లిలో మండల ప్రజల దాహార్తిని తీర్చే పెదపైపు(ఊటగెడ్డ) వర్షానికి మునిగిపోయింది. దీంతో ఊట నుంచి బురనీరు వస్తున్నది. ప్రస్తుతం ఊట బురద నీరు వస్తుండడంతో తాగడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



చింతపల్లిలో ముంపునకు గురైన పెదపైపు



సీలేరు ప్రధాన రహదారిపై హోరున పడుతున్న వాన

జి.మాడుగుల: మండలంలోని శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గత కొన్ని రోజులు ఒక మోస్తరు వర్షాలు పడుతున్నాయి. అయితే శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా వాన పడింది. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు ఉపకరిస్తాయని గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.

సీలేరు: జీకే వీధి మండలంలోని సీలేరు, ధారకొండ పరిసర ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోజువారీ కూలీలు వర్షం కారణంగా ఇళ్లకే పరిమితమయ్యారు. సీలేరులో భారీ వర్షం కారణంగా మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచియింది. సీలేరులో లోతట్టు ప్రాంతాలైన దుర్గావీధి, అల్లూరివీధుల్లో వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల్లోనూ భారీ వర్షం కురిసింది.

అరకులోయ: మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. అధిక శాతం మంది ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావంతో తెల్లవారు జామునుంచే మబ్బులు కమ్ముకోవడంతో పాటు ముసురు వాతావరణం నెలకొంది. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు వాతావరణం కొనసాగింది.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వారపు సంతకు వచ్చిన వారు త్వరగతిన వెనుదిరిగారు. సంత ప్రాంగణం బురదబమంగా మారడం, వినియోగదారులు త్వరగతిన వెనుదిరగడంతో సంత ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో వ్యాపారులు తీవ్ర నిరాశ చెందారు. అయితే వారపు సంతలో టార్పాలిన్లు, గొడుగులు, రెయిన్ కోట్లు విక్రయాలు జోరుగా సాగాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 23 పంచాయతీల పరిధిలో పలు చోట్ల వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మట్టి రహదారులు బుదరమయంగా మారాయి. అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.



అరకులోయలో జోరుగా పడుతున్న వర్షం

పరాయిపంచన క్రీడా పాఠశాల

... 3వ పేజీ తరువాయి

పూర్తిచేసుకొని వెళ్లిపోయాయి. అనువైన క్రీడా మైదానం లేకపోయినప్పటికీ వైటీసీ ఉన్న పక్కనే ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్నే క్రీడా మైదానంగా కోచ్‌లు సిద్ధం చేశారు. ఇక్కడే క్రీడాకారులకు అథ్లెటిక్స్, ఆర్చరీ, హేండ్‌బాల్, వాలీబాల్, బాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్‌లలో శిక్షణ ఇస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నారు. క్రీడాకారులు కూడా అందుకు అనుగుణంగానే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తమ సత్తాను చాటుతున్నారు. బంగారు, రజితం, కాంస్య పతకాలు సాధిస్తున్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు తరగతికి 30 మంది బాలురు చొప్పున 180 మంది విద్యార్థులు క్రీడా పాఠశాలలో శిక్షణను పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ ఎనిమిదేళ్లలో రాష్ట్ర స్థాయిలోని వివిధ పోటీలలో 53 బంగారు, 115 రజితం, 66 కాంస్య పతకాలను సాధించారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో ఆరు బంగారు పతకాలు, 14 రజితం, 13 కాంస్య పతకాలను సాధించారు.

సొంత గూడుకు నిధులు మంజూరు చేయాలి

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన గురుకుల క్రీడా పాఠశాలకు మళ్లీ అదే ప్రభుత్వ హయాంలో ఏర్పాటవుతాయని ఈ ప్రాంతవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఏకైక గురుకుల క్రీడా పాఠశాలను మంజూరు చేసిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రస్తుతం కూడా సీఎం కావడంతో దీనికి మోక్షం కలుగుతుందని వారంటున్నారు. ఈ పాఠశాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి, పాఠశాల, వసతిగృహం, క్రీడామైదానం, కోచ్‌లు, టీచర్లు, సిబ్బందికి నివాసగృహాలు నిర్మించాలని కోరుతున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ పాఠశాల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెరిగిన అల్లం ధర

... 3వ పేజీ తరువాయి

కేజీ రూ.100 నుంచి రూ.120లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అల్లం రైతు వంతాల కొండబాబు మాట్లాడుతూ గత వారం విక్రయించిన ధర కంటే ఈ వారం రూ.20 పెరగడంతో ఆనందంగా ఉందన్నాడు. ఈ ధర కొనసాగితే రైతులకు గిట్టుబాటు ఉంటుందన్నాడు.

అరకులో పర్యాటకుల సందడి

అరకులోయ, జూలై 13: మండల కేంద్రంలో రెండో శనివారం పర్యాటకులు మోస్తరుగా విచ్చేమడంతో సందర్శిత ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది. ట్రైబల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కాఫీ మ్యూజియం, కాఫీ తోటలు, గాలికొండ వ్యూపాయింట్, బొర్రా గుహలు తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో పందర్శకులు విచ్చేశారు. మ్యూజియం ప్రాంగణంలోని కళా గ్రామంలో జిప్‌లైనర్, స్కై-సైక్లింగ్ వంటి సాహస క్రీడల్లో భాగంగా పర్యాటకులు సైక్లింగ్ చేస్తూ కనిపించారు.



మ్యూజియం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

అన్ని వసతులతో పోలీసు క్వార్టర్లు: అదనపు ఎస్పీ

కొయ్యూరు, జూలై 13: పోలీసులు విధి నిర్వహణలో ఏ విధమైన ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అన్ని వసతులతో క్వార్టర్లు నిర్మిస్తున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. కొయ్యూరు పోలీసు స్టేషన్ ఆవరణలో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన మంప, కొయ్యూరు ఎస్ఐలు, సీఐల నివాస గృహాలు, సర్కిల్ కార్యాలయ భవనాలను శనివారం ప్రారంభించారు. అనంతరం మంప పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మారుమూల కొండలపైన ప్రాంతాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రజలతో మైత్రి భావాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కొయ్యూరు, మంప స్టేషన్ల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



సీఐ కార్యాలయ భవనం ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ

ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌లో అలజడి

జి.మాడుగుల, జూలై 13: స్థానిక ప్రభుత్వ జూనియార్ కళాశాల హస్టల్‌లో శుక్రవారం రాత్రి అలజడి నెలకొంది. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో గొడవకు దిగి ఘర్షణ వాతావరణం సృష్టించారు. విద్యార్థులు మద్యం, మారకద్రవ్యాలు తీసుకుని ఘర్షణకు దిగినట్టు స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ గౌరీశంకర్, హెచ్‌డబ్ల్యూవో రవికుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా హాస్టల్ ఉంటున్న విద్యార్థులు శుక్రవారం రాత్రి ఘర్షణ పడ్డారని, అయితే మద్యం, మారకద్రవ్యాలు తీసుకోలేదని తెలిపారు. త్వరలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.

ఏయూలో అక్రమాలపై విచారణకు మీనమేషాలు

... 3వ పేజీ తరువాయి

ఒక్కరోజు కూడా విధులకు రాలేదు. రిజిస్టర్‌లో మిగిలిన ప్రొఫెసర్లు అంతా సంతకాలు చేస్తున్నా ఆయన పేరున్నచోట ఖాళీయే ఉంది.

యూనివర్సిటీలోని టీడీఆర్ (ట్రాన్స్-డిసిప్లినరీ రీసెర్చ్) హబ్‌లో వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతికి ప్రొఫెసర్‌షిప్ ఇచ్చారు. ఇది జరిగి మూడేళ్లయింది. ఆమెకు పది మంది పరిశోధకులను అప్పగించారు. ఆమెకు టీచింగ్ అనుభవం లేదని, ఇతర అర్హతలు ఏమీ లేకున్నా గైడ్‌గా ఎలా నియమిస్తారని చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తే, టీడీఆర్ హబ్ డీన్ జేమ్స్ స్టీఫెన్ ఆమె నియామకాన్ని సమర్థిస్తూ ప్రకటన ఇచ్చారు. ప్రొసీజర్ ప్రకారమే నియమించామని చెబుతున్నారు. అది అవాస్తవమని, నిబంధనలు తుంగలో తొక్కి ఆమెకు అక్కడ అగ్రాసనం వేశారని అంతా కోడై కూస్తున్నా యూనివర్సిటీ తరఫున ఎవరూ స్పందించడం లేదు. దానిపై విచారణ చేస్తామని గానీ, ఆమెను తొలగిస్తామని గానీ అధికారికంగా ఎవరూ చెప్పడం లేదు. ఇప్పటికీ యూనివర్సిటీ ప్రసాదరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తోందని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. విశాఖపట్నంలో గల తెలుగుదేశం నాయకులు...ఇక్కడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వర్సిటీని గాడిలో పెట్టే వారికి బాధ్యతలు అప్పగించేలా కృషిచేయాల్సి ఉంది. ఇదిలావుండగా ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. సీనియర్ ప్రొఫెసర్‌కే ఆ బాధ్యతలు ఇస్తే ప్రక్షాళన చేయవచ్చునంటున్నారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

... 3వ పేజీ తరువాయి

పరిధిలోని పనసలబంద శివార్లలో డంప్ స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మావోయిస్టులు అమర్చిన డంప్‌లన్నీ త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు కాలం చెల్లినవని, గిరిజనులు మావోయిస్టులకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంత యువతీ, యువకులందరూ ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గిరిజనులలో ఇప్పటికే చైతన్యవచ్చిందని, మావోయిస్టులు కంచుకోటలా ఉండే కన్నవరం, వీరవరం, పాతకోట, పెదవలస కొత్తూరుల్లో కూడా గిరిజనులు వారిని ఆదరించడం లేదన్నారు. గాలికొండ రహదారి నిర్మాణంతో అక్కడ విద్య, వైద్య, తదితర రంగాలలో విప్లవం వచ్చిందన్నారు. మారుమూల కొండలపై గల ప్రాంతాలలో సెల్ సేవలను పోలీసులు మెరుగుపరిచారన్నారు. మిగిలి ఉన్న మావోయిస్టులందరూ జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. పార్టీలో కొనసాగుతున్న అరుణ, జగన్ ఎంతో తెలివైన వారని, వారు బాహ్య ప్రపంచంలోకి వచ్చి గిరిజనులను చైతన్య పరిచి, ఉపాధి అవకాశాలు చూపించి, సన్మార్గంలో ఎలా నడవాలో అవగాహన కల్పించాలన్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలను చదువుతూ అడవులలో కూర్చునే కన్నా బాహ్య ప్రపంచంలోకి రావాలన్నారు. అనంతరం గాలింపు చర్యల్లో పాల్గొన్న స్పెషల్ పార్టీ పోలీసులను అభినందిస్తూ.. వారి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. విలేకర్ల సమావేశంలో సీఐ వెంకటరమణ, మంప, కొయ్యూరు ఎస్ఐలు లోకేష్‌కుమార్, దేముడు, రామకృష్ణ, రెండు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'జగన్ విధానాలనే కొనసాగించడం సరికాదు'

పాడేరు రూరల్, జూలై 13: జగన్ విధానాలనే సీఎం చంద్రబాబు కొనసాగించడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) జీవో నంబరు 54 గెజిట్ నోటిఫికేషన్‌ను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఐటీడీఏ కార్యాలయ ప్రధాన గేటు వద్ద యూటీఎఫ్ నాయకులు జీవో పత్రాలు దహనం చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయానికి భిన్నంగా జగన్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 54 గెజిట్ నోటిఫికేషన్‌ను సీఎం చంద్రబాబు కొసాగించడం కొత్త సీసాలో పాత సారా చందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, పి.దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కన్నయ్య, మండల నాయకులు టి.మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులనే నియమించాలి

పాడేరు రూరల్, జూలై 13: ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ విద్యా సంస్థల్లో (ఈఎంఆర్ఐ) అర్హత గల స్థానికులనే ఉపాధ్యాయులుగా నియమించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్నపడాల్, పి.బాలదేవ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల వారు కావడంతో హిందీ భాషలోనే అన్ని పాఠ్యాంశాలు బోధిస్తున్నారని, దీంతో ఆదివాసీ విద్యార్థులకు అర్థం కాక తెల్ల ముఖాలు వేసుకుని చూడాల్సి వస్తున్నదని తెలిపారు. పాడేరు, గుమ్మలక్ష్మీపురం, ఏలూరు, నెల్లూరు ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు అర్థం కాకపోవడంతో పాఠశాల విడిచి వెళ్లిపోతామని చెబుతున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ పాఠశాలల్లో డ్రాపవుట్స్ పెరుగుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశా కార్యకర్తలుగా పరిగణించండి

పాడేరు రూరల్, జూలై 13: సామాజిక ఆరోగ్య కార్యకర్తల (సీహెచ్‌డబ్ల్యూ)ను ఆశా కార్యకర్తలుగా పరిగణించాలని సీహెచ్‌డబ్ల్యూల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసమ్మ డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 36 పీహెచ్‌సీలలో 750 మంది సీహెచ్‌డబ్ల్యూలు ఆశా కార్యకర్తలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తమ సమస్యలపై అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వరకు ఎన్నిసార్లు మొరపెట్టినా కనీస స్పందన లేదని దుయ్యబట్టారు. గిరిజన గ్రామాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు తమను నియమించిన ఐటీడీఏ అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. తమతో పాటు సమాన పని చేస్తున్న ఆశాలకు నెలకు రూ.10 వేలు వేతనం అందిస్తున్న అధికారులు, తమకు మాత్రం నెలకు రూ.4 వేలు ఇవ్వడం దారుణమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని, అందుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'శివారు గ్రామాల్లో రోడ్లకు మంత్రి హామీ'

చింతపల్లి, జూలై 13: శివారు ఆదివాసీ గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇచ్చినట్టు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు తెలిపారు. సాలూరులో మంత్రి సంధ్యారాణిని శనివారం కలిసి సమస్యలు వివరించామని చెప్పారు. శివారు గ్రామాల ఆదివాసీలు ఎదుర్కొంటున్న రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. టీడీటీ ప్రభుత్వ హయాంలో నిధులు విడులైనప్పటికీ నిర్మాణాలు పూర్తికాని అంజలి శనివారం, పెద్దగెడ్డ-కొండవంచుల రహదారులను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగేశ్వరరావు, సునీల్ పాల్గొన్నారు.

గుమ్మగడలో వైద్య శిబిరం



ఆదివాసీలకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ, జూలై 13: మండలంలోని అరమ పంచాయతీ గుమ్మగుడ గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ హరి క్రిష్ణ ఆధ్వర్యంలో గ్రామంలోని అందరికీ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హార్టికల్చర్ సూపర్‌వైజర్‌గా రాంప్రసాద్

గూడెంకొత్తవీధి, జూలై 13: గ్రామీణ ఉపాధి హామీ పథకం హార్టికల్చర్ సూపర్‌వైజర్‌గా రాంప్రసాద్ నియమితులయ్యారు. కొంత కాలంగా జీకే వీధి ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవోగా పనిచేస్తున్న రాంప్రసాద్‌ను డ్వామా అధికారులు హార్టికల్చర్ పర్యవేక్షణ అధికారిగా నియమించడంతో శనివారం విధుల్లో చేరారు. మండలంలో ఉద్యాన పంటల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పాముకాటుతో మహిళ అస్వస్థత

చింతపల్లి, జూలై 13: పెదబరడ పంచాయతీ తెరపల్లి గ్రామంలో ఓ గిరిజన మహిళ పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన టి.సన్యాసమ్మ శనివారం మధ్యాహ్నం పొలంలో నారుమడిలో ఆకు తీస్తుండగా చేతిపై పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు అక్కడ చికిత్స పొందుతున్నది.